సంచలన సాయంకాల పత్రిక

# సత్యం

https://www.satyamdaily.net/

బుధవారం 5-3-2025

సంపుటి: 20 సంచిక: 290

పేజీలు: 8 వెల: రూ.1



## అసెంబ్లీకి రాకుండా జగన్ మాట్లాడుతున్న తీరు హాస్యాస్పదం

**న్యూఢిల్లీ:** అసెంబ్లీకి రాకుండా మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి మాట్లాడుతున్న తీరు హాస్యాస్పదని విజయ నగరం పార్లమెంట్ సభ్యులు కలిశెట్టి అప్పలనాయుడు విమర్శించారు. బుధవారం ఢిల్లీలో మీడియాతో మాట్లాడుతూ జగన్ ప్రతిపక్ష హోదా కోసం పోరాటం చేస్తున్నారా? ప్రజల కోసం పోరాటం చేస్తున్నారా? అనేది ప్రజలకు తెలుసని అన్నారు. జగన్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు అమలు చేసిన రాజారెడ్డి రాజ్యాంగాన్ని ఇప్పుడు అమలు చేయడం కుదరదని, జగన్ మాట్లాడుతున్న తీరు చూస్తుంటే, ఆశ్చర్యం కలిగిస్తుందనిన్నారు. అసెంబ్లీ సమావేశాలకు హాజరు కాకుండా జగన్ మాట్లాడుతున్న తీరు హాస్యాస్పదంగా ఉందన్నారు. అసెంబ్లీకి రాకుండా ప్రైవేట్‌గా మాట్లాడుతున్న జగన్ వ్యాఖ్యలను ప్రజలు గమనిస్తున్నారని, జగన్ ఆయన టీం మొత్తం వ్యవస్థను నాశనం చేశారని కలిశెట్టి ఆరోపించారు. ఎన్డీయే కూటమి సహాయ సహకారాలతో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రాష్ట్ర పరిస్థితిని గాడిన పెడుతున్నారని, జగన్ ప్రజలను తప్పుదోవ పట్టించడానికి ఇలాంటి వాఖ్యలు చేస్తున్నారని విమర్శించారు.



# ఎన్నెన్నో జన్మల బంధం

# నీది-నాది




సత్యంన్యూస్, శ్రీకాకుళం

**ఆ ప్రాంతంలో సాధారణ పౌరుడికి చైతన్యం ఎక్కువో, లేదూ అంటే అక్కడ మున్సిపల్ కార్యాలయానికి వెళ్లిన తర్వాత కమిషనర్ల చేతికి దురద పుడుతుందో తెలియదుగానీ పాలకొండ మున్సిపల్ కమిషనర్లుగా పని చేసినవారిలో మూడొంతుల మంది అవినీతి నిరోధక శాఖకు రెడ్‌హ్యాండెడ్‌గా దొరికి పోవడమే ఇప్పుడు మన టాపిక్. ఏసీబీకి దొరక్కుండా తప్పించుకున్న ఆ కొద్దిమంది కూడా అదృష్టంకొద్దీ ఆ రోజు బయటపడిపోయారు కానీ, వాస్తవానికి వీరి మీద కూడా ఏసీబీకి ఫిర్యాదులు రావడం, ట్రాప్‌కు సిద్ధం కావడం వంటి పరిణామాలు ఉన్నాయి. ఇప్పటి వరకు పాలకొండ మున్సిపల్ ఆఫీసులో కమిషనర్లుగా పని చేసినవారు ఏసీబీకి దొరికిపోవడంతో ఇప్పుడు అక్కడ పని చేయాలంటేనే అధికారులు వణికిపోతున్నారు తప్ప లంచాలు తీసుకోము అని మాత్రం చెప్పడంలేదు.**

**2013**లో మొదటిసారిగా మేజర్ నగర పంచాయతీ నుంచి మున్సిపాలిటీగా పాలకొండ ప్రమోషన్ పొందింది. దీనికి మొదటి కమిషనర్ పిల్లి నాగభూషణరావు. ఈయన మద్దెల సాంబమూర్తి అనే వ్యక్తి దగ్గర్నుంచి ఇంటి ప్లాన్ అప్రూవల్ కోసం రూ.12,500 లంచం తీసుకుంటూ అప్పట్లో ఏసీబీ అధికారులకు దొరికిపోయారు. ఆ రోజు నుంచి ఈ పరంపర మొన్నటి సామంచి సర్వేశ్వరరావు వరకు కొనసాగుతునే ఉంది.

ఈ మున్సిపాలిటీ ఎంత శాపగ్రస్తమైం దంటే.. నగర పంచాయతీగా ఉన్నప్పుడు ఇక్కడ మేనేజర్‌గా పని చేస్తూ మున్సిపాలిటీ అయిన తర్వాత కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన టి.కనకరాజు అనే ఉద్యోగి మున్సి పల్ డైరెక్టరేట్ నుంచి శాఖ మార్పు ఉత్తర్వులు తీసుకున్న మరుసటిరోజే పి.గురునాథ రావు అనే వ్యక్తి నుంచి ప్లాన్ అప్రూవల్ కోసం రూ.10వేలు లంచం ఆశించి ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి ద్వారా దాన్ని తీసుకుంటుండగా ఏసీబీ అధికారులకు దొరికిపోయారు.

2010లో నగర పంచాయతీగా ఉన్నప్పుడు అప్పటి ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ బత్తుల మల్లేశ్వరరావు కూడా ఒక కేసులో టి.శంకరరావు అనే వ్యక్తి నుంచి లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు దొరికిపోయారు. ప్రస్తుతం ఆ కేసును కొట్టేశారు అది వేరే విషయం.

మళ్లీ వర్తమానంలోకి వస్తే.. 2022లో నడిపేన రామారావు అనే కమిషనర్ మున్సి పాలిటీలో షాప్ అలాట్‌మెంట్ కోసం వండాన కూర్మారావు అనే వ్యక్తి నుంచి రూ.20వేలు తీసుకుంటూ ఏసీబీ అధికారులకు చిక్కారు. ఈయన మున్సిపాలిటీలో పందులు

- పాలకొండ కమిషనర్లంతా ఏసీబీ ట్రాప్
- నగర పంచాయతీలోనూ ఇదే ఆనవాయితీ
- హడలిపోతున్న అధికారులు
- మున్సిపాలిటీల్లో ఆల్‌టైమ్ రికార్డు

- మిగతా చివరి పేజీలో




# పెద్దల సభకు కళంకం






- ❖రాజకీయ రహితంగా జరగవలసిన ఎన్నికల్లో కూటమి ప్రచారం
- ❖తాము బలపరిచిన అభ్యర్థులు గెలిచితీరాలని అధ్యక్షులు హుకుం
- ❖చైతన్యం ప్రదర్శించవలసిన చోట డబ్బులు, కానుకలు
- ❖ఓటమి తప్పదనే భయంతోనే దిగజారుడు చర్యలు
- ❖బూత్‌లలోకి చొరబడి జిరాక్స్ ఐడీలతో దొంగ ఓట్లు

ఆంధ్ర రాష్ట్రంలో మూడు శాసనమండలి స్థానాలకు ఎన్నికలు ఫిబ్రవరి 27న జరిగి, మార్చి 3న ఫలితాలు వెలువడ్డాయి. ఈ ఎన్నికలు ఓ ప్రత్యేకమైన ప్రాధాన్యతను సంతరించు కున్నాయి. రాష్ట్రంలోని అధికార తెలుగుదేశం పార్టీ కూటమి కొంతమంది అభ్యర్థులను నిలపగా, వారికి ప్రత్యర్థులుగా రాజకీయాలకు అతీతంగా ప్రోగ్రెసివ్ డెమొక్రటిక్ ఫ్రంట్ (పిడిఎఫ్) అభ్యర్థులకు మధ్య పోటీ జరిగింది. టీడీపీ వర్సెస్ పీడీఎఫ్ అన్నట్టుగా ఎన్నికలు జరిగాయి. ఇది ఒక రకంగా చూస్తే శుభ పరిణామమే. ఎందువల్లంటే ఎటువంటి విలువలు పాటించని అభ్యర్థుల మధ్య పోటీ జరిగితే అందరూ ఒక్కటే, ఎవరు గెలిచినా ప్రజలకు న్యాయం జరగదు అనుకోవడం సహజంగానే చూస్తున్నాం. అలాగే అటువంటి ఎన్నికల్లో ప్రజా సమస్యలు ఏమి చర్చకు కూడా రావు. కానీ ఈ ఎన్నికల్లో ప్రధాన పోటీదారులుగా టీడీపీని డైరెక్ట్‌గా ఢీకొన్న పీడీఎఫ్ అభ్యర్థులు నిలబడడంతో ప్రధాన అంశాలు ఎన్నికలలో చర్చకు వచ్చాయి. ఇది ఆహ్వానించవలసిన పరిణామం.

ఎ.అజశర్మ, ప్రధాన కార్యదర్శి, ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక

సాధారణంగా రాజకీయ రహితంగా జరగవలసిన ఈ ఎన్నికల్లో తెలుగుదేశం, బీజేపీ, జనసేన పార్టీలు ఎన్నికల్లో ప్రత్యక్షంగా జోక్యం చేసుకున్నాయి. గుంటూరు - కృష్ణ పట్టభద్రుల స్థానానికి, ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల స్థానానికి కూటమి అభ్యర్థులుగా రంగంలోకి దింపారు. ఉత్తరాంధ్రలో ఉపాధ్యాయ శాసనమండలి ఎన్నికల్లో ఒక అభ్యర్థికి తెలుగుదేశం, జనసేన పార్టీలు, మరో అభ్యర్థికి కొంతమంది ప్రముఖ బీజేపీ నాయకులు మద్దతు తెలిపారు.

గుంటూరు, కృష్ణ స్థానానికి, గోదావరి జిల్లాల స్థానానికి తెలుగుదేశం అభ్యర్థులు గెలవగా, ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి తెలుగుదేశం బల పరిచిన అభ్యర్థి ఓడిపోయారు. బీజేపీ బలపరిచిన అభ్యర్థి గెలిచారు. మూడు నియోజకవర్గాల్లోనూ సమీప ప్రత్యర్థులుగా పీడీఎఫ్ అభ్యర్థులు నిలిచారు.

వాస్తవంగా పెద్దల సభకు ఎన్నుకో వాల్సిన ఈ స్థానాలలో రాజకీయ పార్టీలు జోక్యం చేసుకొని, మరో సాధారణ ఎన్నికల్లా వీటిని జరపడం సమంజసం కాదు. అయితే అధికారమే పరమావధిగా భావించే నేటి రాజకీయ పార్టీలు అంత సభ్యత, సంస్కారం చూపిస్తాయని భావించలేం. దీనికి అనుగుణంగానే రాష్ట్ర అధికార పార్టీ, ముఖ్యమంత్రితో సహా నేరుగా రంగంలోకి దిగారు. మూడు స్థానాల్లోనూ తాము బలపరిచిన అభ్య ర్థులు ఎట్టి పరిస్థితుల్లోనూ గెలిచి తీరాలని వారి అధ్యక్షులు హుకుం జారీ చేశారు. దీంతో పట్టుదలగా వారి నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు మంత్రులు ప్రచారంలో పాల్గొనడమే కాకుండా అధికార దుర్వినియోగానికి కూడా పాల్పడ్డారు. ఓటర్లను అనేక రకాలుగా ప్రలోభాలకు గురిచేశారు. గతంలో అమలుచేయని అనేక హామీలతో భ్రమ లకు గురి చేశారు. ఇది సరిపోక, హుందాగా జరగవలసిన ఎన్నికల్లో చైతన్యం ప్రదర్శించవలసిన ఓటర్లకు నిస్సిగ్గుగా డబ్బులు పంచారు. కానుకలు అందజేశారు. సిగ్గు, బిడియం లేకుండా కులం పేరు చెప్పి కూడా ఓట్లు దండుకున్నారు. ఈ రకంగా పెద్దల సభకు కళంకం తెచ్చేలా కూటమి పార్టీలు దిగజారాయి.

ఎన్నికల్లో అందరూ గెలవరు కదా..! అందువల్ల పోటీ చేసే అభ్యర్థులకు గెలుపు, ఓటములు సహజమే. ఎన్నిక లలో గెలవడం కూడా అంత పెద్ద గొప్ప ఏమీ కాదు. ఎందుకంటే గెలవడానికి ఎన్ని అడ్డదారులైన తొక్కి గెలిస్తే, అలాంటి గెలుపు నైతికంగా సరైనదేనా అన్నది ఒకసారి పరిశీలించవలసిన విషయమే. దీనికి భిన్నంగా గెలుపు ఓటమిలతో సంబంధం లేకుండా ప్రజలను చైతన్య పరుస్తూ, ప్రజా సమస్యల మీద నిరం తరం కృషి చేసే అభ్యర్థులు ఎన్నికల్లో ప్రచారానికి ఏ అడ్డదారులు తొక్కకుండా, ఆయా తరగతుల ప్రజల సమస్యలే ఎజెండాగా, రాజ్యాంగ స్ఫూర్తికి అను గుణంగా పోటీ చేసిన అభ్యర్థులు ఓడి పోతే అప్పుడు గెలుపు ఓటములను ఎలా చూడాలి అన్నది ప్రధానమైన అంశం.

### అడ్డదారి గెలుపూ గెలుపేనా..!

వాస్తవంగా ప్రజాస్వామ్య స్ఫూర్తితో ఆలోచిస్తే, మన రాజ్యాంగంలో ఓటు పరమ పవిత్రమైన హక్కు. దీనిని బజార్లో సరుకుగా మార్చేసి నోటుతోనో, మందు తోనో, కులం పేరుతోనో ప్రభావితం చేసి ఓట్లు వేయించుకుంటే అంతకంటే నీచం మరొకటి ఉండదు. అందులోనూ విద్యా వంతులు ఓటర్లుగా ఉన్న ఈ ఎన్నికలలో ఇంకా నీచం. ఓటర్లను వాస్తవాలను ఆలోచించేలా, వారిని ఏ రకమైన ప్రలో భాలకు గురి చేయకుండా వదిలేసి, ఒక స్వేచ్ఛాయుత వాతావరణంలో ఎన్నికలు జరిపితే అప్పుడు అసలైన ప్రజాస్వామ్య ఎన్నికలని భావించవచ్చు. కానీ అధికారం, పదవుల రుచి మరిగిన మన రాజకీయ పార్టీలు అలా చేస్తాయనుకో వడం అవివేకమే. అయితే అందరూ అలాగే ఉంటారని భావించలేం.

ఎన్నికల్లో ఓడిన ముగ్గురు పీడీఎఫ్ అభ్యర్థులు నీతి, నిజాయితీ, విలువలకు కట్టుబడి ఎన్నికల్లో పోటీ చేశారు. ప్రత్య ర్థులు అడ్డదారులు తొక్కుతున్నారని తెలిసినా, వీరు మాత్రం అడ్డదారులు కాదు కదా.. కనీసం ఒక్క తప్పటడుగు కూడా వేయలేదు. ఇటువంటి విలువలకు కట్టుబడి పోటీ చేయడం నేటి కలుషిత రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో చాలా అరుదు. కానీ ఇది సాధ్యమేనని పీడీఎఫ్ అభ్యర్థులు నిరూపించారు. ప్రత్యర్థులకు దడ పుట్టించారు. ఇది చాలా గొప్ప విషయం. ఈ వాస్తవాన్ని ప్రత్యర్థులు బయటకు చెప్పే సంస్కారం ప్రదర్శించ లేకపోయినా, వీరికి మనసంటూ ఉంటే, మనసులోనైనా అభినందించి తీరాల్సిందే.

కృష్ణ, గుంటూరు పట్టభద్రుల ఎన్నికల్లో అధికార తెలుగుదేశం పార్టీ అన్ని అఘా యిత్యాలకు పాల్పడింది. డబ్బులు, ముందు, బిర్యానీ వంటివి పంచడమే కాకుండా, అవి కూడా తమను గెలిపించ లేవనే అనుమానంతో నేరుగా ఎన్నికల బూత్‌లనే స్వాధీనం చేసుకుంది. అనేక బూత్‌ల్లో పోలీసుల సహకారంతో పీడీఎఫ్ ఎన్నికల ఏజెంట్లను బయటకు తరి మేసింది. ఎన్నికల సిబ్బందిని లొంగదీసు కుని, కొన్ని ప్రాంతాలలో బూత్‌లను స్వాధీనం చేసుకుంది. ఓట్లు గుద్దుకుంది. మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఇతర ప్రజా ప్రతినిధులు అంతమంది రంగం లోకి దిగినా ఓటమి తప్పదనే భయంతోనే డైరెక్ట్‌గా దిగబడి, ఇటువంటి దిగజారుడు చర్యలకు పాల్పడింది.

గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎన్నికల్లో అధికార కూటమి పూర్తిగా కులం కార్డును వాడుకుంది. దానితో పాటు డబ్బు, అధికార దుర్వినియోగానికి పాల్పడింది. అయినా ఓడిపోతామనే భయంతో ఎన్నికల రోజున మంత్రులు, ఎమ్మెల్యేలు ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా నేరుగా ఎన్నికల బూత్‌ల్లోకే ప్రవేశించారు. ఎన్నికల సిబ్బందిపై ఒత్తిడి తీసు కొచ్చి జిరాక్స్ ఐడి కార్డులు చూపించి దొంగ ఓట్లను యథేచ్ఛగా వేయించుకున్నారు.

ఉత్తరాంధ్ర టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికలకు మంత్రులు, ఎమ్మెల్యేలు ప్రత్యక్షంగా రంగంలోకి దిగారు. వీరికి కేంద్రమంత్రి, శ్రీకాకుళం పార్లమెంటు సభ్యులు ఏకంగా వీడియో ద్వారానే ప్రచారానికి దిగారు. ప్రైవేట్ విద్యాసంస్థల ప్రతినిధిగా పోటీ చేస్తున్న ఒక స్వతంత్ర అభ్యర్థిని బెది రించి, ప్రలోభ పెట్టి, వివిధ రకాలైన ఆశలు చూపించి, వీరి అభ్యర్థికి మద్దతుగా ఉపసంహరించుకునేలా చేశారు. ఎమ్మెల్యేలు నియోజకవర్గాల వారీ ఉపాధ్యాయుల మీటింగులు పెట్టి బెదిరిస్తూ మాట్లాడారు. ఎమ్మెల్యే అయిన మాజీ టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు ఒక హైస్కూల్లో ఎన్నికల ప్రచారంలో పాల్గొని, కనీసమైన సభ్యత కూడా లేకుండా హెడ్ మాస్టారు సీట్లో కూర్చుని ప్రచారం

- మిగతా చివరి పేజీలో

● ఎడిటోరియల్

# రాష్ట్రాల హక్కులకు పాతర

కేంద్ర పన్నుల్లో రాష్ట్రాలకు దక్కాల్సిన వాటాకు మోదీ కోత పెట్టాలని భావిస్తున్నారా? దీని ద్వారా ద్రవ్యలోటును పూడ్చుకోవాలని ప్రయత్నిస్తున్నారా? దశలవారీగా దీన్ని అమలు చేసేందుకు కసరత్తు చేస్తున్నారా? ఈ ప్రశ్నలన్నింటికీ అవుననే సమాధానమే వస్తున్నది. రాష్ట్రాల పన్ను వాటాను తగ్గించేందుకు ఆర్థికశాఖ ఇప్పటికే ప్రతిపాదనలు సిద్ధం చేసినట్టు 'రాయిటర్స్' ఒక సంచలన కథనాన్ని ప్రచురించింది. కేంద్ర వ్యూహాత్మక చర్యలపై అనేక అంశాల్ని ఇందులో ప్రస్తావించింది. ఇప్పటివరకు కేంద్ర పన్నుల ద్వారా రాష్ట్రాలకు వచ్చే వాటా నలభై ఒక్కశాతం ఉండగా ఇందులో ఒకశాతం తగ్గించి నలభైకి పరిమితం చేయాలనే ఆలోచనతో కేంద్రం ముందుకు సాగుతున్నది! ఇలా చేయడం ద్వారా కేంద్రానికి అదనంగా రూ.35వేల కోట్ల ఆదాయం సమకూరనుంది. ఆర్థికవేత్త అరవింద్ పనగరియా నేతృత్వంలోని ఆర్థిక సంఘానికి ఈ విషయమై మోదీ సర్కార్ ఇప్పటికే ప్రతిపాదించినట్టు సమాచారం. అంతకన్నా ముందు మార్చి నెలాఖరున జరిగే కేంద్ర కేబినెట్ భేటీలో పన్ను వాటాల్లో కోతకు మోదీ ఆమోదం తెలిపి ఆ తర్వాత పరిశీలన నిమిత్తం ఆర్థిక సంఘానికి పంపే అవకాశముంది. ఈ నిర్ణయానికి ఫైనాన్స్ కమిషన్ పచ్చజెండా ఊపితే ఇక 2026-27 ఆర్థిక సంవత్సరం నుంచి ఇది అమల్లోకి రానుంది. దేశంలో అధికారాన్ని చేపట్టిన వారెవరైనా పార్టీలు, రాజకీయాలకతీతంగా నడుచుకోవాలి. రాష్ట్రాలకు న్యాయబద్ధంగా రావాల్సిన నిధుల్ని త్వరితగతిన విడుదల చేయాలి. ఏదైనా విపత్తులాంటిది వస్తే అవసరాన్ని బట్టి 'ప్రత్యేక'ంగా ఆదుకోవాలి కూడా. కానీ ఈ దశాబ్దకాలంగా జరుగుతున్న పరిణామాల్ని చూస్తే మోదీ సర్కార్ అలాంటి విధానాలకు ఎప్పుడో స్వస్తి పలికినట్టు తేటతెల్లమవుతున్నది. 80వ దశకంలో కేంద్ర పన్నుల్లో ఇరవై శాతం ఉన్న వాటా రానురానూ 41 శాతానికి పెరిగింది. రాష్ట్రాల ఆర్థిక పరిస్థితి దృష్ట్యా వీలైతే పెంచాలి, తప్పదనుకుంటే అలాగే ఉంచాలి. కానీ అందులోనూ కోత విధించడానికి సిద్ధమవ్వడం సమంజసం అనిపించుకోదు. ఈ ఆర్థిక సంవత్సరానికి గానూ స్థూల జాతీయోత్పత్తి (జీడీపీ)లో కేంద్రం ద్రవ్యలోటు 4.8 శాతం ఉండగా అదే సమయంలో రాష్ట్రాల ద్రవ్యలోటు దేశ జీడీపీలో 3.2 శాతంగా ఉంది. ప్రస్తుత ఆర్థిక ఏడాదిలో వసూళ్లను బట్టి మాత్రమే కేంద్రం ఈ అంచనా వేసింది. భవిష్యత్తులో పన్ను వసూళ్లు భారీగా పెరిగితే, రాబడి కూడా మరింత పెరుగుతుంది. నాలుగేండ్ల క్రితం కరోనా మహమ్మారి దేశాన్ని ఎంతగానో ఉక్కిరిబిక్కిరి చేసిందో తెలిసిందే. ఎన్నో పరిశ్రమలు మూతపడ్డాయి. ప్రజల కొనుగోలుశక్తి పూర్తిగా పడిపోయింది. ఉపాధి రంగం ఇంకా కోలుకోనేలేదు. ఇలాంటి విపత్కర పరిస్థితిని అర్థం చేసుకుని ఆదుకోవాల్సిన కేంద్రం కాడి వదిలేసింది చూశాము. తర్వాత కాలంలో సెస్సులు, సర్‌చార్జీలను విధించిందని, ఇందులో ఏమాత్రం వాటా దక్కకుండా చేసి రాష్ట్రాలపై అధికభారం మోపిందని ప్రభుత్వాలు మొత్తుకున్నాయి. అయినా కేంద్రం ముందుకే వెళ్లింది తప్ప వెనుకడుగు వేయలేదు. గతంలో మొత్తం పన్ను ఆదాయంలో సెస్సులు, సర్‌చార్జీల వాటా 9శాతం నుంచి 12శాతంగా ఉండేది. అది ఇప్పుడు 15 శాతానికి పెరిగింది. దీనికితోడు పెద్ద నోట్ల రద్దు, జీఎస్టీ భారం రాష్ట్రాలకు గుదిబండగా మారింది. వాస్తవానికి జీడీపీలో అరవై శాతం వాటా రాష్ట్రాలు అందిస్తున్నాయని, 2017 జులై నుంచి జీఎస్టీ అమల్లోకి వచ్చాక రాష్ట్రాలకు సొంతంగా పన్నులు పెంచుకునే అవకాశాలు లేకుండా పోయాయని రాయిటర్స్ పేర్కొంది. ఇలాంటి పరిస్థితుల్లో కేంద్ర పన్నుల్లో రాష్ట్రాల వాటాను తగ్గిస్తే ఇంకేముంది? ప్రభుత్వాలు మరిన్ని ఇబ్బందుల్లో పడతాయి. సంక్షేమ పథకాలపై కూడా దీని ప్రభావం పడకతప్పదు. కేంద్రం గత ఐదేండ్లుగా ద్రవ్యలోటు గ్రాంట్లు రూ. 1.18లక్షల కోట్ల నుంచి రూ.13,700కోట్లకు తగ్గించింది. రాష్ట్రాల హక్కులకు పాతరేస్తున్నది. వాటాలు, గ్రాంట్లు, నిధుల విషయమై అనేక కొర్రీలు పెడుతున్నది. కేంద్ర ఆర్థిక విధానాలు తమ రాష్ట్రాలకు తీవ్రనష్టం చేస్తున్నాయని రాష్ట్ర ప్రభుత్వాలు ఆందోళన చేస్తున్నా పట్టించుకున్న దాఖలాల్లేవు. కేరళ, తమిళనాడు, పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రులైతే ప్రధాని తీరును బహిరంగంగానే విమర్శిస్తున్నారు. ఢిల్లీ వేదికగా కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ ఆందోళన కూడా చేపట్టారు. అయినప్పటికీ కేంద్రం తీరు మారలేదు. ఇప్పటికే బీజేపీ పాలిత ప్రభుత్వాలను ఒకరకంగా, బీజేపీయేతర ప్రభుత్వాలను ఇంకోరకంగా చూస్తూ రాష్ట్రాలపై వివక్షను ప్రదర్శిస్తున్నది. ఈ నేపథ్యంలో పన్నుల వాటాలో 'ఒక్క శాతం' కుదింపును అమలు చేస్తే కేంద్ర,రాష్ట్రాల మధ్య ఎడబాటు మరింత పెరిగే అవకాశం ఉన్నది.

## కొరికానను కలిసిన వీవింగ్ లైవ్స్ టీమ్

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ప్రపంచ ప్రఖ్యాత పొందూరు ఖాదీ బ్యాక్‌డ్రాప్‌గా చేనేత కార్మికుల జీవితాలను ప్రతిభింబించేలా తీసిన లఘు చిత్రం 'వీవింగ్ లైవ్స్' ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ ఆఫ్ తెలంగాణలో ఉత్తమ డాక్యుమెంటరీ అవార్డ్ గెలుచు కుంది. ఈ డాక్యుమెంటరీని సంపత్ పవన్ ఫిల్మ్ కంపెనీ, శ్రీకాకుళం హవా కలిసి నిర్మించారు. ఈ ప్రాజెక్ట్‌లో పలువురు ప్రతిభావంతులైన వ్యక్తులు సహకారాన్ని అందించారు. అంతర్జాతీయ వేదికపై ఇలాంటి గుర్తింపు పొందడం శ్రీకాకుళం జిల్లాకు గర్వకారణంగా గా భావిస్తూ, 'వీవింగ్ లైవ్స్' పేరుతో తీసిన లఘుచిత్రానికి ఉత్తమ డాక్యుమెంటరీ అవార్డు రావడం పట్ల సుడా చైర్మన్ శ్రీకాకుళం జిల్లా జనసేన నాయకులు శ్రీ కొరికాన రవికుమార్ చిత్ర బృందనికి సన్మానించి ప్రత్యేకంగా అభినందించారు.



## అభిమానుల్లో సంక్రాంతి నింపింది

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

విక్టరీ వెంకటేష్, ఐశ్వర్య రాజేష్, మీనాక్షి చౌదరిలు నటించిన సంక్రాంతి వస్తున్నాం సినిమా అభిమానుల్లో సంక్రాంతులను నింపిందని వెంకటేష్, రానా ఫ్యాన్ అసోసియేషన్ టౌన్ అధ్యక్షులు వేణు తెలిపారు. సంక్రాంతికి వస్తున్నాం సినిమా 50 రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా కిన్నెర థియేటర్‌లో కేక్ కట్ చేసి అభిమానులు మంగళవారం సందడి చేశారు. అనంతరం సంక్రాంతికి రిలీజ్ అయిన మూవీస్ లో ప్రేక్షకులకు ఎంతగానో అలరించి రికార్డుస్థాయిలో అతి తక్కువ సమయంలో ఎక్కువ కలెక్షన్ చేసి వెంకటేష్ సినీచరిత్రలో ఇప్పటి హీరోలకి దీటుగా కలెక్షన్ చూపిందని చెప్పారు. ఈ కార్యక్రమంలో థియేటర్ మేనేజర్ వరప్రసాద్, జయరాం, వేణు, విజయకుమార్, దగ్గుబాటి అభిమానులు పండుగ వాతావరణంలో థియేటర్ సిబ్బందికి మిఠాయిలు పంపిణీ చేస్తూ ఆనందాన్ని చాటుకున్నారు



## మద్దతు గ్యారెంటీ చట్టం చేయాలి

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

కేంద్ర ప్రభుత్వం అన్ని పంటలకు 50% ఫార్ములా ప్రాతిపదికన మద్దతు ధరల గ్యారంటీకి చట్టం చేయాలని రైతుసంఘాల సమన్వయ కమిటీ కన్వీనర్ తాండ్ర ప్రకాశరావు, ఆంధ్రరైతుసంఘం జిల్లా కార్యదర్శి కె.మోహనరావు, కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వేలమల రమణ, పోలాకిప్రసాదరావు అన్నారు. బుధవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద సయుక్త కిషాన్ మోర్చ్ ఆద్వర్యంలో జరిగిన ధర్నాను ఉద్దేశించి వారు మాట్లాడుతూ రైతులకు రుణమాఫీ చేయాలని, సమగ్ర పంటల బీమా అమలు చేయాలని, వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ల గుప్పిట్లో పెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం తెచ్చిన డిజిటల్ అగ్రిమిషన్, నేషనల్ ఫ్రేమ్‌వర్క్ ఆన్ అగ్రికల్చర్ మార్కెట్స్, (వ్యవసాయ మార్కెట్లను నిర్వీర్యం చేసే విధానం), సహకార రంగాలను నిర్వీర్యం చేసే బహుళ సహకార వ్యవస్థ అమలును రైతులంతా వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. జిల్లాలో రైతుల వద్దనున్న ధాన్యాన్ని పూర్తిగా ప్రభుత్వం కొనుగోలు చేయాలని వంశధార బాహుదా నదులు అనుసంధానం చేసి ఇచ్ఛాపురం వరకు సాగునీరు అందించేందుకు బడ్జెట్లో నిధులు కేటాయించాలన్నారు. వంశధార నాగావళ్లి నదులు అనుసంధానం, నారాయణపురం కుడి కాలవని ఆధునికరించి చివర భూములకు సాగునీరు అందించాలని వారు డిమాండ్ చేశారు. రైతులు ఎదుర్కొంటున్న జీడి,మిర్చి, ధాన్యం, కందులు, జొన్నలు, పత్తి, శనగ, పోగాకు వంటి పంటలకు మద్దతు ధరలు ఇచ్చి ప్రభుత్వం కొనుగోలు చెయాలని, పెండింగ్ లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులకు నిధులు కేటాయించి నిర్మాణం చేపట్టాలని, ఆఫ్షోర్ ప్రాజెక్టుకు పూర్తిచేయాలని అందుకు బడ్జెట్లో పూర్తిస్థాయిలో నిధులు కేటాయించాలని, కౌలు రైతులకు యజమానులతో సంబంధం లేకుండా గుర్తింపు కార్డులు ఇవ్వాలని, ఉపాధి హామీ పనులు సంవత్సరానికి 200 రోజులుపని కల్పించి 600 రూపాయలు కూలి ఇవ్వాలని డిమాండ్ చేశారు. జిల్లాలో ఐ.టి.డి.ఏ ఏర్పాటు చేయాలని, గిరిజన భూములకు రక్షణ కల్పించాలని, 1/70 అమలు చేయాలని డిమాండ్ చేశారు . ఈ ధర్నాలో కే.కొండయ్య, పి.సాంబమూర్తి, అల్లు .సూర్యనారా యణ, ఎస్ .కృష్ణవేణి రాజేశ్వరరావు, రామారావ్, కన్నప్పడు ఎస్ మీనాక్షి, ఎస్.రజిని, బి నాగమణి ,ఎస్.అప్పన్న, తదితరులు పాల్గొన్నారు .



## జిల్లా కలక్టర్‌ను కలిసిన గ్రామ సర్వేయర్ల సంఘం



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

- సమస్యలు పరిష్కరించాలని వినతి
- సానుకూలంగా స్పందించిన కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం జిల్లా సర్వే ఉద్యోగుల సమస్యల పరిస్కారం చెయ్యాలని గ్రామ సర్వేయర్ల సంఘం ప్రతినిధులు స్థానిక కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ను మంగళవారం రాత్రి కలసి వినతిపత్రం అందించారు. అనంతరం మాట్లాడుతూ శ్రీకాకుళం జిల్లాలో రీసర్వే చేస్తున్న సర్వే ఉద్యోగులు ఎదుర్కుంటున్న పలు సమస్యలకై కలక్టర్‌ను కలిశామని, అందుకు సానుకూలంగా స్పందించారని హర్షం వ్యక్తం చేశారు. శ్రీకాకుళం జిల్లాలోని పైలట్ విలేజెస్ లో రీసర్వే వర్క్ కోసం ఇతర విలేజ్ సర్వేయర్స్ అందరూ పైలట్ విలేజెస్ కి, ఇతర గ్రామాలకు, మండలాలకు డిప్యూటేషన్ వెళ్తున్నందున విలేజ్ సర్వేయర్స్ కి బయోమెట్రిక్ వెసులుబాటు కల్పించాలని, పైలట్ విలేజ్ రీసర్వేలో ఎస్వోపి ప్రకారం సమూహంలో ఉన్న విఆర్వో, ఇతర సభ్యులు అటెండ్ అవ్వకపోవడం వలన, జిటి చేయుటకు ఆలస్యం అవుతుందని, నిర్దేశించిన టార్గెట్లు చేరుకోవడానికి విఫలము అవుతున్నామన్నారు. రీసర్వే నందు సర్వే శాఖ పాత్ర ఎంతవరకు అన్నది అధికారులకు అర్థమయ్యే విధంగా వివరించి, సర్వేయర్లను సర్వే శాఖ పనులకి, రిసర్వే కాక అనేక సంక్షేమ సర్వేలకు ఉపయోగించుకుంటున్నారని, ఎమ్మార్వో, డిఐఓఎస్, ఎంపిడివోలకు, మండల సర్వేయర్లకి తగు ఆదేశాలు ఇవ్వాలన్నారు. గ్రామ సర్వేయర్లకు పనిదినముల లో పని చేసి, సెలవు దినములలో సెలవు పొందు విధముగా వెసులుబాటు అందించాలని, రీ సర్వే డిప్యూటీషన్లో ఉన్న గ్రామ సర్వేయర్ల స్థానంలో, మండలంలో ఉన్న గ్రామ సర్వేయర్లను తాత్కాలికంగా భర్తీ చేయాలన్నారు. గ్రామ సర్వేయర్లు రీసర్వే ప్రాజెక్టులో తీవ్రమైన ఒత్తిడికి గురై అనారోగ్యం బారినపడుతున్నామని కావునా ఉన్నతాధికారులు మా సమస్యలు పరిస్కారమయ్యే విధంగా చొరవతీసుకోవాలన్నారు.



బాధాకరం..
సింగర్ కల్పనను హాస్పిటల్‌కు తీసుకుపోతున్న ఫోటో బాధాకరం.. ఆమెకు ఏమైంది..? ప్రస్తుతానికి ఎవరూ ఏమీ చెప్పలేని దుస్థితి.. (ఈ ఫోటో పబ్లిష్ చేయాల్సి వస్తుందని అనుకోలేదు) కల్పనా రాఘవేందర్.. శాస్త్రీయ సంగీతంలో మంచి విద్వత్తు ఆమె సొంతం.. ఇప్పుడు కాదు, చిన్నప్పటి నుంచీ శిక్షణ, సాధన.. గాన రాక్షసి అంటారు అందరూ.. అంటే ఏదైనా అలవోకగా పాడగలదు. ఆమె తండ్రి రాఘవేందర్ ఓ గాయ కుడు, తల్లి సులోచన గాయకురాలు.. చిన్నతనం నుంచీ ఆమె స్టూడి యోలు తిరుగుతూనే పెరిగింది. ఎంసీఏ చేసింది.. ఆమె నటి, డబ్బింగ్ ఆర్టిస్ట్ కూడా.. కష్టమైన పాట పాడాలంటే తమిళం, తెలుగు, మలయా ళం, కన్నడం భాషల్లో ఆమెనే ఎంచుకు నేవారు. 3వేల వరకూ సినిమా పాటలు పాడింది. స్టేజీ షోలకు లెక్కే లేదు.

## నిలకడగా కల్పన ఆరోగ్యం..



ప్రముఖ గాయని కల్పన ప్రాణాపాయస్థితి నుంచి బయటపడింది. నిద్రమాత్రలు మింగి ఆత్మహత్యాయత్నం చేసిన ఆమె ఆరోగ్యం ప్రస్తుతం నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు. హైదరాబాద్‌లోని నిజాంపేటలో ఒక ప్రైవేట్ ఆస్పత్రిలో ఆమెకు చికిత్స చేస్తున్నారు. జో××ఫ్రె×× అనే నిద్ర మాత్రలను ఆమె వేసుకున్నట్టు సమాచారం. ఈ కేసు విచారణను కేపీ హెచ్‌బీ పోలీసులు వేగంగా దర్యాప్తు చేస్తున్నారు. మంగళవారం సాయంత్రం కల్పన అపస్మారక స్థితిలోకి వెళ్లడంతో ఈ ఘటనకు సంబంధించిన అంశాలు పూర్తిగా వెలుగులోకి రాలేదు. ప్రస్తుతం ఆమె ఆరోగ్యం నిలకడగా ఉండడంతో నేడు తన వాంగ్మూలాన్ని పోలీసులు నమోదు చేయనున్నారు. మానసిక ఒత్తిడితో ఆమె ఈ నిద్ర మాత్రలను అధిక మోతాదులో మింగినట్లుగా పోలీసులు అనుమానిస్తున్నారు.

వివరాల్లోకి వెళ్తే కల్పన ప్రస్తుతం రెండో భర్త ప్రసాద్‌తో కలిసి నిజాంపేటలోని ఒక గేటెడ్ కమ్యూనిటీలో నివాసం ఉంటుంది. రెండో భర్త వృత్తి రీత్యా కొద్దిరోజుల కిందట చెన్నై వెళ్లాడు. కల్పనకు ఆయన ఫోన్ చేస్తుంటే ఆమె స్పందించకపోవడంతో అనుమానం వచ్చిన భర్త పొరుగింటి వారికి ఫోన్ చేసి ఒకసారి చూడమని చెప్పాడు. కాలింగ్‌బెల్ ఎన్నిసార్లు కొడుతున్నా స్పందించలేదని ప్రసాద్‌కి వారు తెలిపారు. దీంతో విషయాన్ని కమ్యూనిటీ సెక్రటరీకి ప్రసాద్ తెలియజేశారు. పోలీసులకు సమాచారమిచ్చాడు. పోలీసులు రంగప్రవేశం చేసి వెంటనే దగ్గర్లోని ఆస్పత్రికి తరలించారు. మొదటి భర్త వల్లే కల్పన నిద్రమాత్రలు మింగేదనే కోణంలో ఆయన్ను పోలీసులు అదుపులోకి తీసుకుని ఎంక్వైరీ చేస్తున్నారు. అయితే, పెద్ద కూతురుతో కల్పనకు ఈ మధ్య ఫోన్‌లో గొడవైందని రెండో భర్త ప్రసాద్ పోలీసులకు చెప్పినట్లు సమాచారం. కేరళలో ఉంటున్న పెద్ద కూతురును అక్కడి నుంచి వచ్చి హైదరాబాద్‌లో ఉండమని కల్పన అడుగుతుంటే ఆమె అందుకు ఒప్పుకోవడం లేదని, దీంతో ఫోన్‌లో ఇద్దరి మధ్య పెద్ద గొడవ జరిగిందని తెలుస్తోంది.

తుపాకి.కామ్ సౌజన్యంతో...

# పైపైనే నవ్వులు.. లోపలంతా విషాదమే!

బరువు బాగా పెరిగింది, లావుగా ఉండేది. భర్తతో పడలేదు, విడాకులు..ఒక కూతురు..ఒంటరిగా కూతురితో ఉండేది.. బరువు తగ్గే సర్జరీలు గట్రా ఏమీ లేకుండా యోగా, డైట్, ఎక్సర్‌సైజులతో బరువు తగ్గించుకుంది. లైఫ్ చాలెంజింగుగా తీసుకుంది. ఆమధ్య మరో వివాదం.. తను అటూ ఇటూ తిరుగుతోంది కాబట్టి కూతుర్ని మరీ దగ్గరి బంధువుల దగ్గర ఉంచింది.. అక్కడ లైంగిక వేధింపులు.. కేసు కూడా పెట్టినట్టుంది.. కొన్నాళ్లు ఎక్కడా కనపించలేదు. ఈమధ్యే మళ్లీ కొన్ని షోలలో కనిపిస్తోంది. గతంలో తెలుగు బిగ్‌బాస్‌లో కూడా పార్టిసిపేట్ చేసింది. ఆమె బతుకులో విద్వత్తు ఎంతో విషాదమూ అంతే.. అందరితో కలివిడిగా, జోవియల్‌గా ఉండే ఆమె అంటే అందరికీ అభిమానమే.. వర్తమా నంలోకి వస్తే.. నిజాంపేటలోని వర్టెక్స్ ప్రివిలేజ్ గేటెడ్ కమ్యూనిటీలో ఉంటుందట. భర్తతో కలిసి ఉంటున్నట్టు అని రాస్తున్నాయి వాట్సప్ న్యూస్ గ్రూపులు.. ఫ్లష్ మెయిన్ సైట్లు కూడా.. రెండు రోజులుగా ఆమె బయటికి రాకపోవడంతో అసోసియేషన్ భర్తకు సమాచారం ఇచ్చి, పోలీసులకు ఫోన్ చేసిందట. తీరా తలుపులు బలవంతంగా తెరిచి చూస్తే ఆమె అపస్మారక స్థితిలో ఉంది. నిద్రమాత్రలు మింగి ఆత్మహత్యాయత్నం చేసిందని భావిస్తున్నారు. హాస్పిటల్‌లో చికిత్సలో ఉంది ఇప్పుడు.. నువ్వు కోలుకోవాలమ్మా, మరిన్ని మంచి పాటల్ని ఆలపించాలి. తన భర్త అంటున్నారు, ఆమె మళ్లీ పెళ్లి చేసుకుందా..? తెలియదు..! చెన్నై నుంచి భర్త బయల్దేరాడని వార్త.. అసలు రెండు రోజుల నుంచీ ఆమె అలాగే పడిఉంటే పలకరించి, ఏమైందని కనుక్కునే పరిస్థితి లేకపోవడం దయనీయమే.. భర్తను కూడా పోలీసులు అనుమానిస్తున్నారు ఇప్పుడు. ఫ్చ్.. అద్భుతమైన గానప్రతిభ ఉన్న ఆమె వ్యక్తిగత జీవితం మొదటి నుంచీ విషాదమే.. చివరకు ఇప్పటి స్థితి దాకా.. ట్రాజెడీ.., విషింగ్ హర్ స్పీడీ రికవరీ!!

– ముచ్చట సౌజన్యంతో...

## ఈసారి ఆమె గళం కాదు, ఆమె మౌనం అందరికీ వినిపించింది!

*"ఆమె గానం వినిపించింది.. కానీ, ఆమె బాధను వినలేకపోయాం!" "పాటలు పాడితేనే నా బాధను మర్చిపోగలను." "నా గళం వినిపిస్తేనే నేను బతికున్నట్లుగా ఉంటుంది."*

ఇవి గాయని కల్పన ఎన్నోసార్లు ఇంటర్వ్యూలలో చెప్పిన మాటలు. కానీ, ఈసారి ఆమె మౌనంగా నిద్రమాత్రలు మింగింది! ఈసారి ఆమె గళం కాదు, ఆమె మౌనం అందరికీ వినిపించింది! ఈ వార్త విన్న వెంటనే మనం దరం షాక్ అయ్యాం. "ఎందుకు ఇలాచేసుకుంది?" "ఆమెకేమైనా పెద్ద సమస్య ఉందా?" "పాపం, ఎవరైనా తనను ఆదరించాల్సింది!" కానీ, ఇది ఒక్క కల్పన కథ కాదు. రోజురోజుకూ వేలాదిమంది మన చుట్టూ నిశ్శబ్దంగా కరిగిపోతున్నారు! వారి మనస్సులో పోరాటం జరుగుతోంది.. కానీ, మనం చూసేలా లేదు! చాలామంది మనుషులు బయటకు చిరునవ్వుతో కనిపిస్తూ లోపల నరకయాతన అనుభవిస్తూ ఉంటారు. "నీకు అన్ని ఉన్నాయిగా.. నీకెందుకు డిప్రెషన్?" అని అడిగే సమాజమే.. తీవ్రమైన ఒత్తిడి, ఒంటరితనం ఏంటో అర్థం చేసుకోదు. "సహాయం కోరే ధైర్యం లేకపోతే, సహాయం చేసేవారైనా ముందుకు రావాలి!" ఆత్మహత్య అనేది ఒకరోజు తీసుకునే నిర్ణయం కాదు. ఎంతో కాలంగా నిండిపోతున్న భావోద్వేగ భారం ఒక్క క్షణంలో పేలిపోతుంది. ఎవరైనా మన చుట్టూ మౌనంగా ఉంటే, వారిని వెంటనే గుర్తించాలి.

### పరిస్థితిని మార్చే 3 మేజిక్ స్టెప్స్

<u>వినండి (Listen):</u> ఎవరైనా బాధలో ఉంటే, వారికి "నువ్వు ఒంటరివి కావు" అనే నమ్మకం ఇవ్వండి.

<u>అంగీకరించండి (Acknowledge):</u> "ఇలా అనిపించడం సహజమే" అని చెప్పండి, "నీకు ఏమైంది?" అని కాకుండా, "నీకు తోడుగా నేనున్నాను" అని చెప్పండి.

<u>సహాయం అందించండి (Support):</u> అవసరమైతే, ప్రొఫెషనల్ కౌన్సెలింగ్, కుటుంబ మద్దతు, స్నేహితుల ఆత్మీయత ఇవ్వండి.

### అండగా నిలుద్దాం!

మన చుట్టూ ఉన్న వాళ్లు హఠాత్తుగా చాలా మౌనంగా ఉంటే.. సామాజిక మాధ్యమాల్లో "ఇంకెందుకు బతకాలి?" లాంటి పోస్ట్ పెడితే.. ఎప్పుడూ సరదాగా ఉండే వాళ్లు ఒక్కసారిగా మారిపోతే "ఎవరికీ నేను అవసరం లేదు" అనే మాట మాట్లాడితే.. వెంటనే వారితో మాట్లాడండి. తక్షణ మానసిక సహాయం అందించండి..

– పై విశ్వేష్

## సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ మంజూరు చేయండి

(సత్యంన్యూస్, పాతపట్నం)



రాష్ట్రంలోనే పాతపట్నం నియోజక వర్గం భౌగోళికంగానూ, అభివృద్ధిలోనూ అత్యంత వెనుకబాటుకు గురికావడంతోపాటు ఇక్కడ సరైన వైద్య సదుపాయాలు లేకపోవడం, వ్యవసాయాధారిత నియోజకవర్గం కావడంతో అత్యవసర పరిస్థితుల్లో సుదూర ప్రాంతాలకు వెళ్లి వైద్యం చేయించుకునే స్తోమత ప్రజలకు లేదని, కనుక ఈ నియోజకవర్గంలో అన్ని సదుపాయాలతో కూడిన వంద పడకల గల సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిని మంజూరు చేయాలని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు కోరారు. ఈమేరకు సచివాలయంలో ప్రశ్నోత్తరాల సమయంలో ఆయన ఈ విషయాన్ని లేవనెత్తారు. సంబంధిత మంత్రి దీనిపై స్పందించి మంజూరు చేయాలని ఆయన కోరారు.



శ్రీకాకుళం జిల్లా నరసన్నపేటకు చెందినటువంటి మెజీషియన్ కళాకారుడు పండిట్ సత్యనారాయణ గారు గుండెపోటుతో మరణించారు వారి కుటుంబానికి శ్రీకాకుళం జిల్లా కళాకారులు, ఈవెంట్ మేనేజర్లు రూ.72,600లను సహాయంగా అందించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తోటి కళాకారుల కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఈవెంట్ మేనేజర్లు కళాకారులు పాల్గొన్నారు. – సత్యంన్యూస్, నరసన్నపేట



ఈరోజు 17వ డివిజన్‌లోని పండా వీధి మెర్జింగ్లో సీబీ ఈవెంట్ కార్యక్రమం జరిగింది ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా డివిజన్ ఇన్చార్జి బస్వా రాజేశ్‌రెడ్డి, రవాణా మాదిగ పాల్గొన్నారు. ఈవెంట్‌లో భాగంగా 3,4 నెలల గర్భిణీ స్త్రీలు పాల్గొన్నారు. కార్యక్రమంలో గర్భిణీ స్త్రీలకు ఎంసీపీ కార్డులు, రేషన్ అందజేశారు. కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు, ఆయాలు, ఎఎన్‌ఎంలు, డివిజన్ల ప్రజలు పాల్గొన్నారు. – సత్యంన్యూస్, శ్రీకాకుళం

## ఆరోగ్యమైన ఆలోచనతో సంపూర్ణ ఆరోగ్యం

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

స్థానిక ఇల్లిసిపురంలో గల బ్రహ్మకుమారిస్ సేవకేంద్రం నందు, మానవత స్వచ్ఛంద సేవా సమస్థ, బ్రహ్మకుమరిస్ సంయుక్తంగా ఈ నెల 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని, మహిళలకు ఆరోగ్య భద్రతలు, సూచనల కార్యక్రమాన్ని నిర్వహించారు. మహిళ ఆరోగ్యంగా ఉంటే కుటుంబం, పరివారం ఆరోగ్యంగా ఉంటుందని, మహిళల ఆరోగ్యమే మహా సంపద అన్న ఉద్దేశంతో, స్త్రీల సమగ్ర ఆరోగ్య సదస్సును ఏర్పాటు చేశామన్నారు. ముఖ్యఅతిథిగా గైనకాలజిస్ట్ కుమారి డాక్టర్. సంధ్యశ్రీ పండా మాట్లాడుతూ బ్రహ్మకుమారి జయలక్ష్మి సోదరి ఆహ్వానించి, వారి ద్వారా ఈ కార్యక్రమాన్ని చెయ్యటం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో డాక్టర్ మణిభూషణ్, మానవతా స్వచ్ఛత సంస్థ చైర్మన్ విష్ణుమూర్తి, మానవతా వైస్ ప్రెసిడెంట్ అరుణ, బ్రమ్మకుమారీలు తదితరులు పాల్గొన్నారు.



## ఎమ్మెల్సీ లేదా ఇతర ప్రాధాన్యత కలిగిన పోస్టు ఇవ్వాలి



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

తాను 2014 నుంచి తెలుగుదేశంపార్టీలో ఉన్నప్పటికీ ఎప్పుడూ కూడా టీడీపి అని చెప్పుకోలేదని, తెలుగుశక్తి పేరుతో గత వైకాపా ప్రభుత్వంపై పోరు కొనసాగించానని, తెలుగుశక్తి అధ్యక్షుడు బి.వి.రామ్ అన్నారు. పార్టీలు మారకుండా తెలుగుదేశం పార్టీ పట్ల విధేయతతో పని చేశానని పేర్కొన్నారు. వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ మంగళవారం ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడును కలిశానని తెలిపారు. ఎమ్మెల్సీ లేదా తగిన ప్రాధాన్యత గల స్థానం కేటాయించాలని విజ్ఞప్తి చేశానన్నారు. ముఖ్యమంత్రి కూడా సానుకూలంగా స్పందించారని.. ముందు నుంచి కూడా తగిన స్థానం ఇస్తానని చెపుతూనే ఉన్నారని తెలిపారు. టీడీపి కోసం నిరంతరం పోరాటం చేసిన తాను చంద్రబాబునాయుడు స్టాండింగ్‌కు అనుగుణంగానే ఏకైక రాజధాని అమరావతి రాజధాని కోసం పోరాటం చేశానన్నారు. యువతకు ఉపాధి కల్పించాలనే తండ్రి బి.వి.రామారావు ఆశయం కోసం కృషి చేస్తున్నానని, ఈ సందర్భంగా ప్రస్తావించారు. ఇదిలా ఉండగా గత ప్రభుత్వం భీమిలిలో శారదాపీఠానికి 15 ఎకరాల విలువైన భూమిని కేటాయిస్తే దాన్ని తిరిగి ప్రభుత్వం స్వాధీనం చేసుకునేలాగా తెలుగు శక్తి కీలకమైన పోరాటం చేసిందన్నారు. మరోవైపు తెలుగు శక్తి పేరుతో పరోక్షంగా వైయస్ జగన్మోహన్ రెడ్డి కొనసాగించిన ప్రజా వ్యతిరేక పాలనపై ప్రజాస్వామ్యబద్ధంగా యుద్ధం చేశానన్నారు. ఈ క్రమంలోనే తొమ్మిది పాటలను విడుదల చేసి వైసిపి దుర్మార్గాలను ప్రజలలోకి తీసుకెళ్లాలని తెలిపారు. కార్యక్రమంలో పాలూరు శేషమాంబ, హ్యూమన్ రైట్స్ సభ్యుడు నాయుడు, రాష్ట్ర కళింగ కోమటి అధ్యక్షులు కిషోర్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## మీడియాకు వన్నె తెచ్చేవి వృత్తి విలువలే!

(సత్యంన్యూస్, టెక్కలి)

మీడియా యాజమాన్యాలకైనా, జర్నలిస్టులకైనా వృత్తి విలువలే వన్నె తెస్తాయని చిన్న, మధ్యతరహా వార్తాపత్రికల సంఘం (స్మామ్నా) రాష్ట్ర అధ్యక్షులు నల్లి ధర్మారావు అన్నారు. బుధవారం టెక్కలిలో జరిగిన జర్నలిస్టుల సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడారు. మీడియా స్వేచ్ఛ అంటే, యాజమాన్యాల స్వేచ్ఛ కాదని, రాజ్యాంగ పరిధిలో భావ ప్రకటన స్వేచ్ఛను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. టెక్కలి ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు బెండి నరసింగరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో అర్బన్ పోలీస్ సిఐ అంబటి విజయ్‌కుమార్ మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణలో పోలీస్, మీడియా మధ్య సమన్వయం అవసరమన్నారు. తమ శాఖ మాదిరిగానే మీడియా కూడా చాలా కేసుల్లో పరిశోధనతో, ఎన్నో వాస్తవాలు వెలికితీసి తమకు సహకరిస్తోందని చెప్పారు. బార్ అసోసియేషన్ అధ్యక్షులు విజయ్‌కుమార్ మాట్లాడుతూ సామాజిక ప్రగతిలో మీడియా పాత్ర చాలా కీలకమని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో ఇటీవల ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర కౌన్సిల్‌కు ఎన్నికైన బెండి నర్సింగరావు, ఎంవి మల్లేశ్వరరావు, కొంచాడ రవికుమార్, గుడిమెట్ల శ్రీనివాస్‌రావులను అతిథులు సత్కరించారు.



కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎన్.ఈశ్వరరావు, విశాలాంధ్ర విశాఖ బ్రాంచ్ మేనేజర్ సనపల నరసింహులు, యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సిహెచ్ జగదీష్, సనపల రమేష్, ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టుల అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బాలకృష్ణ, మొదలవలస వాసు, స్మామ్నా జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కుంచె చిన్నారావు, ఎస్.నవచైతన్య తదితరులు పాల్గొన్నారు.

### పారదర్శకంగా
## మద్యం షాపుల కేటాయింపు

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

జిల్లాలో 2024-26 సంవత్సరానికి గానూ మద్యంషాపుల కేటాయింపు చేస్తామని జిల్లా ప్రొహిబిషన్ & ఎక్సైజ్ అధికారి సీహెచ్ తిరుపతి నాయుడు పేర్కొన్నారు. ఈమేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. నూతన మద్యం పాలసీలో భాగంగా గీత కులాల వారికీ 10% మద్యం దుఖాణాలు కేటాయించామన్నారు. దీనిలో భాగంగా జిల్లాలో గీత కులాల వారికి కేటాయించిన 16 మద్యం దుకాణాలకు గాను 166 దరఖాస్తులు అందాయన్నారు. సొండి కులాల వారికి కేటాయించిన 2 మద్యం దుకాణాలకు గాను 37 దరఖాస్తులు, మొత్తం 18 మద్యం దుకాణాలకు గాను 203 దరఖాస్తులు ఆన్‌లైన్‌లో, హైబ్రిడ్ పద్ధతి, ఆఫ్‌లైన్ పద్ధతి ద్వారా ఫిబ్రవరి 8 వరకు స్వీకరించామన్నారు. గతంలో తెలిపినట్లు ఫిబ్రవరి 10న డ్రా తీయాలని నిర్ణయించామన్నారు. అయితే ఎలక్షన్ కోడ్ కారణంగా కమిషనర్ ఆఫ్ ప్రొహిబిషన్ & ఎక్సైజ్, విజయవాడ వారి ఆదేశాల మేరకు వాయిదా వేశామన్నారు. ఈనెల 4తో ఎలక్షన్ కోడ్ ముగియడంతో డ్రా తీసే కార్యక్రమాన్ని ఈనెల6న తీయాలని నిర్ణయించామని వెల్లడించారు. ఈమేరకు 6న ఉదయం 10.30 గంటలకు ఆర్ట్స్ కాలేజ్ రోడ్‌లో గల అంబేద్కర్ ఆడిటోరియంలో డ్రా తీస్తామని ఆయన వివరించారు. దరఖాస్తుదారులు దీనిని గమనించి కుల ధృవీకరణ, నివాస పత్రాలతోపాటు ఎంట్రీ పాస్, ఆధార్‌కార్డు తీసుకుని ఉదయం 9 గంటలకు హాజరు కావాలని ఆయన సూచించారు.



నిత్యాన్నదాన ప్రసాద వితరణ కార్యక్రమంలో 401వ రోజైన బుధవారం మండలంలోని బొబ్బిలిపేటకు చెందిన స్వర్గీయ చింతాడ లక్ష్మీనారాయణ జ్ఞాపకార్థం ఆయన కుమారుడు అప్పారావు, తేజ, వారి కుటుంబసభ్యులు 35మందికి అన్నసమర్పణ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమాజసేవ చేయడంలో ఉన్న సంతృప్తి మరెందులో ఉండదన్నారు. అనాధలను ఆదుకునేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని కోరారు.

– సత్యంన్యూస్, ఆమదాలవలస

## విద్యార్థులకు సీపీఆర్‌పై అవగాహన అవసరం

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

విద్యార్థులకు సీపీఆర్‌పై అవగాహన అవసరమని, ప్రముఖ వైద్యులు జేసీ డాక్టర్ వినోద్‌కుమార్ కూర్మాన బుధవారం అన్నారు. స్థానిక గీతాంజలి పాఠశాలలో జేసీఐ శ్రీకాకుళం సన్‌రైజర్స్ అధ్యక్షులు సింగూరు ప్రవీణ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు సీపీఆర్‌పై అవగాహన, నైపుణ్యాభివృద్ధిపై అవగాహన కల్పించారు. అనంతరం డాక్టర్ వినోద్ మాట్లాడుతూ ఈ కార్యక్రమం ద్వారా సీపీఆర్ ప్రాముఖ్యతను తెలియజేసి, ప్రాణాపాయ పరిస్థితుల్లో ఎలా స్పందించాలి అనే అంశాలపై అవగాహన కల్పించగలిగామన్నారు. ఆగిన గుండెకు మళ్లీ జీవం పోసే ఒక ప్రక్రియ అని తెలియజేస్తూ, సీపీఆర్ చేసే విధానాన్ని వివరించారు. శ్రీకాకుళం సన్‌రైజర్స్ సీపీఆర్ ఆవశ్యకతను ప్రజలకు తెలియజేస్తూ, దానిని చేసే విధానాన్ని ప్రాక్టికల్‌గా తెలియజేయాలనే సంకల్పంతో ప్రతినెల సీపీఆర్ కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. దానిలో భాగంగా శ్రీకాకుళంలో ఉన్న అన్ని పాఠశాలలో సంప్రదిస్తున్నామని అధ్యక్షులు ప్రవీణ్ తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు, చార్టర్ ప్రెసిడెంట్ జెసి దూసి సంతోష్, సెక్రెటరీ జేసీ సుదర్శన్, ట్రెజరర్ జేసీ వెంకటేష్ ఐతమ్, వైస్ ప్రెసిడెంట్ జగదీష్, జూనియర్ జేసీ లోహిత్ తదితరులు పాల్గొన్నారు








## పథకాలు అందక ఆందోళనలో విద్యార్థులు

(సత్యంన్యూస్, పాతపట్నం)



కూటమి ప్రభుత్వం కార్పొరేట్ విద్యకు అందలం ఎక్కించి, ప్రభుత్వ విద్యను నిర్వీర్యం చేస్తోందని మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి అన్నారు. చంద్రబాబు ఎన్నికలలో ఇచ్చిన హామీలను అమలు చేయాలనే ఆలోచన లేదన్నారు. ఎన్నికలలో సూపర్ సిక్స్ పథకాలు అని చెప్పి, సంపద సృష్టిస్తానని ప్రచారం చేసి వాటిపై కనీసం నోరు కూడా మెదపడం లేదన్నారు. ఈ కూటమి ప్రభుత్వంలో అన్ని వ్యవస్థలు నిర్వీర్యం అవుతున్నాయన్నారు. జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు రైతుల కోసం దీక్ష చేశామని, పెరిగిన విద్యుత్ ఛార్జీలు తగ్గించాలని ధర్నాలు చేశామని, ఇప్పుడు విద్యార్థుల కోసం చంద్రబాబు సర్కారుపై మరో నిరసన గళాన్ని విప్పేందుకు సిద్ధమైనట్లు చెప్పారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, వసతి దీవెన కింద ఇవ్వాల్సిన బకాయిలు తక్షణమే విడుదల చేయాలన్నారు. కళాశాల యాజమాన్యాలు విద్యార్థులకు సర్టిఫికెట్ ఇవ్వకుండా ఇబ్బందులు పెడుతున్నాయని తెలిపారు. పెండింగ్ బకాయిలు చెల్లించకపోవడంతో విద్యార్థులు చదువు మధ్యలో ఆపేసి పనులకు వెళ్లే దుస్థితి వచ్చిందని, ప్రభుత్వం తక్షణమే తన వైఖరి మార్చుకొని విద్యార్థులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. తల్లికి వందనం కాదని, ఆ పథకం పిల్లలు, తల్లులకు పంగనామం అన్నట్లుగా ఉందని దుయ్యబట్టారు. అధికారంలోకి రాగానే అందరికీ రూ.15వేల చొప్పున ఎందరు పిల్లలు ఉంటే.. అంత మందికి ఇస్తామని ఆర్భాటంగా ప్రకటించి ఇప్పటి వరకు ఇవ్వకపోవడం ఏమిటని ప్రశ్నించారు. కళాశాల ఫీజు,హాస్టల్, మెస్ ఫీజులు చెల్లించలేక విద్యార్థులు సతమతమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఉండి ఉంటే.. సక్రమంగా అమ్మఒడి అందేదని, ఫీజు రీయింబర్స్మెంట్, వసతి దీవెన, విద్యా దీవెనలకు డబ్బులు నేరుగా తల్లుల ఖాతాలలో వేసే వారన్నారు.

## తెలుగు మహాసభలకు కుమార్ నాయక్‌కుఆహ్వానం

(సత్యంన్యూస్, పలాస)



ఈనెల 8, 9 తేదీల్లో చత్తీస్‌ఘడ్ మారుతి మంగళభవన్, గుడియారి సెక్టర్, రాయిపూర్‌లో జరిగే తెలుగు మహాసభల సందర్భంగా "మన తెలుగు జానపదాల కళా ప్రాంగణాన్ని ప్రారంభకులుగా" ఏపీ జానపద కళాకారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ కుమార్ నాయక్‌కు చత్తీస్‌ఘడ్ తెలుగు సభల నిర్వహణ కమి టీ ఆహ్వానం పంపింది. "మన తెలుగు జానపదాలు"అనే అంశంపై పలువురు వక్తలు వేదికలో మాట్లాడుతారని, ఆ వేదికలో పాల్గొనే అరుదైన అవకాశం ఆంధ్రప్రదేశ్ నుండి కాశీబుగ్గ వాసి డాక్టర్ కుమార్ నాయక్ లభించడం పట్ల జన జాగృతి వ్యవస్థాపక అధ్యక్షులు టి.కృష్ణమూర్తి, ఉద్దానం రచయితల వేదిక అధ్యక్షులు కుట్టుం వినోద్, గిడుగు రామమూర్తి కళావేదిక కన్వీనర్ శిష్టుమనోజ్, లయన్స్ క్లబ్ అధ్యక్ష టి.మాధవరావు, పింఛనుదారుల ప్రధాన కార్యదర్శి ఎన్.అప్పారావు హర్షం వ్యక్తపరిచారు.






## ఎమ్మెల్సీ దువ్వాడపై అవనిగడ్డ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ఉపముఖ్యమంత్రి కొణిదెల పవన్‌కళ్యాణ్‌పై అసభ్యకరంగా అనుచిత వ్యాఖ్యలు చేసిన వైకాపా ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్‌పై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని అవనిగడ్డ మండల జనసేన పార్టీ అధ్యక్షులు గుడివాక శేషుబాబు అవనిగడ్డ పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో కృష్ణాజిల్లా జనసేన పార్టీ ఉపాధ్యక్షులు మత్తి వెంకటేశ్వరరావు, కృష్ణాజిల్లా లీగల్‌సెల్ కార్యదర్శి బాసు నాంచాంయ్య నాయుడు, ఎంపీటీసీ సభ్యులు బొప్పన భాను, కటికల వసంత్, జనసేన పార్టీ సీనియర్ నాయకులు బచ్చు వెంకట్నాథ్, చెన్నగిరి సత్యనారాయణ, జనసేన పార్టీ నాయకులు అన్నపరెడ్డి రాందాస్, సింహాద్రి పవన్, రాజనాల వీరబాబు తదితరులు పాల్గొన్నారు.





















ఆ ఖర్చంతా విజయసాయి కుమార్తె

# కంపెనీ నుంచి రాబట్టాలి

**- భీమిలి బీచ్ వద్ద అక్రమ నిర్మాణాలపై హైకోర్టు ఆదేశాలు -**




**(సత్యంన్యూస్, అమరావతి)**

విశాఖపట్నంలోని భీమిలి బీచ్ వద్ద అక్రమ నిర్మాణాలపై ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో బుధవారం విచారణ జరిగింది. సీఆర్‌జడ్ నిబంధనలకు విరుద్ధంగా గోడ నిర్మాణం చేపట్టడంపై ఉన్నత న్యాయస్థానం ఆగ్రహం వ్యక్తం చేసింది. విజయసాయి కుమార్తె నేహారెడ్డి వ్యాపార భాగస్వామిగా ఉన్న కంపెనీపైనా న్యాయస్థానం మండిపడింది. కంపెనీపై పోలీసులకు ఫిర్యాదు చేయాలని అధికారులను ఆదేశించిన న్యాయమూర్తి అలా చేస్తేనే క్రిమినల్ చర్యలు తీసుకోవడానికి వీలుంటుందని పేర్కొన్నారు. బీచ్‌లో గోడ తొలగించి ఆరు అడుగుల పునాదిని అలాగే వదిలేయడం సరికాదని, గోడ వల్ల కలిగిన నష్టాన్ని అంచనా వేసేందుకు కేంద్ర పర్యావరణ, అటవీ మంత్రిత్వ శాఖ అధికారులతో కమిటీ ఏర్పాటు చేయాలని, గోడ కూల్చివేత ఖర్చు, పర్యావరణ నష్టం నేహా రెడ్డి కంపెనీ నుంచి రాబట్టాలని న్యాయమూర్తి ఆదేశించారు. భీమిలి వద్ద 4 రెస్ట్రో బార్ల అక్రమ నిర్వహణపై దాఖలైన పిల్ పైనా హైకోర్టులో విచారణ జరిగింది. రెస్ట్రో బార్లపై సర్వే చేసి నివేదిక ఇవ్వాలని కమిటీని ఆదేశించింది. తదుపరి విచారణను న్యాయస్థానం మూడు వారాలకు వాయిదా వేసింది.

# ఎన్నెన్నో జన్మల బంధం నీది - నాది

(మొదటిపేజీ తరువాయి)

పట్టించి, దాన్ని మాంసం కోసం వేరే వ్యక్తులకు అమ్మేశారన్న కథనం 'సత్యం' పాఠకులకు తెలుసు.

ఇప్పుడు తాజాగా 2024లో సామంచి సర్వేశ్వరరావు కమిషనర్‌గా వచ్చారు. ఈయన అక్కడ ప్రభుత్వాసుపత్రిలో గైనకాలజిస్ట్‌గా పని చేస్తున్న డాక్టర్ రౌతు భారతి నుంచి లంచం తీసుకుంటుండగా, ఏసీబీ అధికారులకు కొద్ది రోజుల క్రితం చిక్కారు. వాస్తవానికి ఇక్కడ కమిషనర్ సర్వేశ్వరరావు డాక్టర్ భారతికి మున్సిపాలిటీ పరంగా చేసిన ఫేవర్ లేదు. తన ఆధ్వర్యంలో డెలివరీ అయిన ఒక బిడ్డకు సంబంధించి డేటాఫ్ బర్త్ సర్టిఫికెట్ కోసం మున్సిపల్ కార్యాలయానికి సమర్పించిన డేటాను డాక్టర్ భారతి తప్పుగా పంపించారు. దీంతో బిడ్డ తండ్రి తమ బర్త్ సర్టిఫికెట్ తప్పుగా వచ్చిందని, దీనిపై చర్యలు తీసుకోవాలని కమిషనర్‌కు ఫిర్యాదు చేస్తే, ఆయన డాక్టర్ భారతికి రూ.500 ఫైన్ వేసి వదిలేశారు. కానీ బిడ్డ తండ్రి మాత్రం ఆర్టీఐ ద్వారా తప్పు ఎక్కడ జరిగిందనేది తేల్చి, ఆర్టీఐ కమిషనర్‌కు నేరుగా అప్రోచ్ అయ్యారు. దీంతో డాక్టర్ భారతి నుంచి వచ్చిన డేటా తప్పని, దాని వల్లే డేటాఫ్ బర్త్ సర్టిఫికెట్ తప్పుగా వచ్చిందని ఆర్టీఐ కమిషనర్ ముందు చెప్పడానికి సామంచి సర్వేశ్వరరావు చెప్పాల్సి ఉంది. అయితే ఇక్కడ భారతికి ఫేవర్‌గా ఆర్టీఐ కమిషనర్‌కు చెప్పడం కోసమే లంచం అడిగారని ఏసీబీ అధికారులు గుర్తించినా, మున్సిపల్ కార్యాలయంలో జరిగిన తతంగం కాబట్టి, అది కూడా డేటాఫ్ బర్త్ సర్టిఫికెట్‌తో ముడిపడి ఉంది కాబట్టి ఈయన్ను కూడా రిమాండ్‌కు పంపారు. వీరు కాకుండా మరో ఇద్దరిపై ఏసీబీకి గతంలో ఫిర్యాదులు వచ్చాయి. కానీ అక్కడికి వెళ్లే లోపు వాతావరణం మారిపోవడంతో వీరు తప్పించుకున్నారు. లేదంటే పాలకొండలో పని చేసిన కమిషనర్లకు శతశాతం ఏసీబీ రికార్డు దక్కుండేది. ఒక్కోసారి ఏసీబీ ట్రాప్ నుంచి విచిత్రంగా అధికారులు బయటపడుతుంటారు.

2016 ఆగస్టులో రాజాం కమిషనర్ పొందర సింహాచలం ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో బుక్కయ్యారు. వాస్తవానికి ఆయన్ను 2011లో ఒకసారి, 2013లో మరోసారి రెడ్‌హ్యాండెడ్‌గా ఏసీబీ పట్టుకోవాల్సింది. 2011లో ఫిర్యాదు ఇచ్చిన వ్యక్తి, ఆ తర్వాత దాన్ని వెనక్కు తీసుకోవడంతో ఏసీబీ వెనక్కు వచ్చేసింది. 2013లో ఫిర్యాదుదారుడితో అక్కడ డబ్బులు ఇప్పిస్తూ ఇక్కడి నుంచి బయల్దేరిన ఏసీబీ అధికారులకు పొందూరు వద్ద ఫ్లైఓవర్ లేకపోవడంతో రెండు రైళ్లు వచ్చిపోయే రైల్వేగేట్లు పడిపోయాయి. దీంతో అధిక సమయం అక్కడే పోయింది. ఈలోగా ఫిర్యాదుదారుడి నుంచి సింహాచలం సొమ్ములు తీసుకోవడం, ఆతర్వాత ఎంచక్కా వెళ్లిపోయారు కూడా. ఇలాంటిదే పాలకొండలో ఇద్దరు కమిషనర్ల వ్యవహారంలో కూడా జరిగింది.

# ఎమ్మెల్సీ అభ్యర్థిగా నాగబాబు పేరు ఖరారు



**(సత్యంన్యూస్, అమరావతి)**

ఎమ్మెల్సీ అభ్యర్థిగా ఏపీ డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ సోదరుడు, జనసేన నేత నాగబాబు పేరు ఖరారైంది. ఎమ్మెల్యే కోటా అభ్యర్థిగా ఆయన పేరును జనసేన అధినేత పవన్ ఖరారు చేశారు. నామినేషన్ వేయాలని నాగబాబుకు ఆయన సమాచారం ఇచ్చారు. కొద్దిరోజుల కిందట ఖాళీ అయిన మూడు రాజ్యసభ స్థానాల్లో రెండు టీడీపీ, ఒకటి బీజేపీ తీసుకున్నాయి. రాజ్యసభ అభ్యర్థుల ఎంపిక సమయంలో నాగబాబును మంత్రివర్గంలోకి తీసుకోబోతున్నట్లు టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు ప్రకటించారు. పవన్‌కల్యాణ్ కోరిక మేరకు తొలుత ఆయన్ను మంత్రివర్గంలోకి తీసుకోవాలని ముఖ్యమంత్రి భావించారు. ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఒక స్థానం ఆయన కోసం కేటాయించారు. తీరా ఎన్నికల షెడ్యూలు వెలువడిన తర్వాత నాగబాబుకు కార్పొరేషన్ ఛైర్మన్ పదవి ఇవ్వనున్నట్లు ప్రచారం జరిగింది. కానీ, తాజాగా ఎమ్మెల్యే కోటాలో ఎమ్మెల్సీ అభ్యర్థిగానే నాగబాబు పేరును ఖరారు చేశారు.



## చంద్రబాబును కలిసిన ఎమ్మెల్సీ గాదె

**(సత్యంన్యూస్, అమరావతి)**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడును ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా విజయం సాధించిన గాదె శ్రీనివాసులు నాయుడు బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శ్రీనివాసులునాయుడును సీఎం అభినందించారు. ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించడంతో పాటు వారిని గౌరవిస్తామని చంద్రబాబు చెప్పారు. సీఎంకు శ్రీనివాసులు నాయుడు కృతజ్ఞతలు తెలిపారు. సీఎంను కలిసిన వారిలో బీజేపీ నేత, మాజీ ఎమ్మెల్సీ మాధవ్, పీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు మిట్టా కృష్ణయ్య, ఏపీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్రఅధ్యక్షుడు బాలాజీ తదితరులు ఉన్నారు.

# అదంతా అవాస్తవం

**- సెయింట్‌పాల్స్ యాజమాన్యం -**

**(సత్యంన్యూస్, శ్రీకాకుళం)**

ఈ నెల 3వ తేదీన తమ యాజమాన్యం ఒక విద్యార్థిని ఎండలో నిల్చోబెట్టినట్టు వచ్చిన ఆరోపణ అవాస్తవమని సెయింట్ పాల్స్ యాజమాన్యం తెలిపింది. ఈ మేరకు బుధవారం ప్రకటన విడుదల చేస్తూ విద్యార్థి ఫీజు విషయమై మాట్లాడినందుకు వారి తల్లే గేటు వద్ద నిల్చోబెట్టి ఫొటో తీసి, విద్యార్థి సంఘాలతో హడావుడి చేసి, డీఈవో వరకు తీసుకెళ్లారని, తాము కూడా దీనిపై డీఈవోకు ఫిర్యాదు ఇవ్వనున్నట్లు తెలిపారు. గత 35 ఏళ్లుగా మంచి విద్యా ప్రమాణాలతో నడుస్తున్న తమ స్కూల్ అభివృద్ధి కొంతమందికి కంటకంగా మారడంతోనే ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నారని సెయింట్ పాల్స్ స్కూల్ యాజమాన్యం ఆ ప్రకటనలో పేర్కొంది.




# మే నెలలో 'తల్లికి వందనం'



**(సత్యంన్యూస్, అమరావతి)**

'తల్లికి వందనం' పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెడుతోందని మంత్రి నారా లోకేశ్ తెలిపారు. శాసనసభలో ఆయన మాట్లాడారు. 'తల్లికి వందనం' పథకానికి సంబంధించిన మార్గదర్శకాలను త్వరలోనే ఇస్తామని, బడ్జెట్‌లో రూ.9407 కోట్లు ఈ పథకానికి కేటాయించామని తెలిపారు. గత ప్రభుత్వంలో దీనికి ఏడాదికి రూ.5,540 కోట్లు కేటాయించారని, గతంతో పోలిస్తే ఇది 50 శాతం అధికమని అన్నారు. ఎన్నికలకు ముందు సూపర్-6 అనే కార్యక్రమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లామని, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా 'తల్లికి వందనం' పథకాన్ని చంద్రబాబు ప్రకటించారని, మే నెలలో తప్పనిసరిగా ఇంటిలో ఎంతమంది చదువుకునే బిడ్డలుంటే అంతమందికీ ఈ పథకాన్ని వర్తింపజేస్తామని లోకేశ్ తెలిపారు.

# చెరువును కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

**- రెవెన్యూ అధికారులకు కిల్లిపాలెం వాసులు వినతి -**



**(సత్యంన్యూస్, శ్రీకాకుళంరూరల్)**

కిల్లిపాలెం గ్రామంలోని ఎచ్చెర్లవీధికి ఎదురుగా సర్వే నెంబరు 178-13లో 1.18 ఎకరాల విస్తీర్ణం గల తంగివారి చెరువును కబ్జా చేసి రిజిస్ట్రేషన్ చేసుకున్నవారిపై చర్యలు తీసుకోవాలని స్థానికులు ఆందోళనకు దిగారు. బుధవారం శ్రీకాకుళం తహసీల్దారు కార్యాలయంలో సూపరింటెండెంట్ శ్రీనివాస్‌ను కలిసి ఆక్రమణదారులపై ఫిర్యాదు చేశారు. గ్రామానికి ఉన్న ఏకైక చెరువు ఆధారంతో చుట్టుపక్కల భూములకు సాగునీరు అందించడానికి, జీవాల తాగునీరుకు ఉపయోగిస్తున్నట్టు గ్రామస్తులు తెలిపారు. సదరు చెరువు ఎస్ఎల్ఆర్‌లో కోరుకొండ వెంకట అప్పారావు తదితరుల పేరుతో నమోదైవుందని, దీన్ని భూబదలాయింపులో భాగంగా తంగివారి కుటుంబానికి సంక్రమించినప్పటికీ చెరువు గ్రామ ప్రజల అవసరాలకు వినియోగించడానికి గ్రామపెద్దలు, పూర్వీకులు దశాబ్దాలు క్రితమే నిర్ణయించారని తెలిపారు. ఎస్ఎల్ఆర్, ఎఫ్ఎంబీలో సర్వే నంబర్ 178-13 భూమిస్థితి చెరువుగానే ఉందని, భూమి ధరలు పెరగడంతో కొందరు రెవెన్యూ అధికారులు, సిబ్బంది సహకారంతో మచ్చ శ్రీనివాసరావు కోరుకొండ వారసులతో కలిసి తప్పుడు పత్రాలతో కోరుకొండ వీరభద్రస్వామి పేరుతో ఉన్న 1-బీలో పట్టాదారు అనుభవదారులు కాలమ్‌లో అన్‌నోన్‌గా చూపించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. కోరుకొండ వీరభద్ర స్వామికి సంబంధం లేని వ్యక్తులు పాలిశెట్టి రాజేశ్వరమ్మ, మాడుగుల రాజమోహన్‌రావు, సూర్యకుమారి, కోరుకొండ వెంకట సూర్యనారాయణ మచ్చ శ్రీనివాసరావుతో చేతులు కలిపారని, కాశీబుగ్గ జాయింట్ సబ్ రిజిస్ట్రార్‌ను మేనేజ్ చేసి తప్పుడు పత్రాలతో తంగివారిచెరువుపై 2024 మార్చి 30న రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్ సృష్టించారని తెలిపారు. రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్‌లో భూస్థితి పల్లం భూమిగా చూపించారని వివరించారు. సుమారు వందేళ్లు పైబడి సర్వే నెంబర్ 178-13లో 1.18 ఎకరాల విస్తీర్ణం భూమి చెరువు గర్భంగానే ఉందని, కాశీబుగ్గ సబ్ రిజిస్ట్రార్, రెవెన్యూ అధికారులు కలిసి రిజిస్ట్రేషన్ అయిన తర్వాత ఆటోమ్యూటేషన్ చేయించారని తెలిపారు. ఈ ప్రక్రియ పూర్తిచేసిన తర్వాత కబ్జాదారులు చెరువు గర్భాన్ని చదును చేయడానికి 30 మంది రౌడీమూకలను వెంటబెట్టుకొని ఈ నెల 3న రెండు జేసీబీలతో వచ్చారని, చెరువు దక్షిణ, ఉత్తర గట్లను తొలగించడానికి చేసిన ప్రయత్నాలను స్థానికులు అడ్డుకున్నామని, రూరల్ పోలీసులు వచ్చిన తర్వాత చదును చేసే ప్రక్రియ పూర్తిగా నిలిపి వెళ్లిపోయారని వివరించారు. చెరువును ఆక్రమించి తప్పుడు రిజిస్ట్రేషన్ చేసిన వారిని, దురాక్రమణదారులకు సహకరించిన కాశీబుగ్గ సబ్‌రిజిస్ట్రార్, రెవెన్యూ అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు. వినతి ఇచ్చినవారిలో చెరువుల పరిరక్షణ సమితి ప్రతినిధులు సంధ్యాచౌదరి, స్థానికులు తంగి ఈశ్వరరావు, తంగి శివప్రసాద్, రెడ్డి రమణమూర్తి, రెడ్డి జ్యోతీప్రసాద్, ఎచ్చెర్ల కృష్ణ, తంగి కుటుంబ సభ్యులు, గ్రామస్తులు ఉన్నారు.

# పెద్దల సభకు కళంకం

మొదటిపేజీ తరువాయి

చేశారు. ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు అనేక మంది ఓటర్లకు దగ్గరుండి డబ్బులు, కానుకలు పంపిణీ చేయడం వంటి బ్రోకర్ పనులకు కూడా దిగజారారు. అయినా ఓటర్లు వీరిని తిరస్కరించి ఓడించారు.

కానీ, విచిత్రం ఏంటంటే కింద పడినా తామే గెలిచామని చెప్పుకోవడం తెలుగుదేశం నాయకులకే చెల్లింది. ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో తెలుగుదేశం బహిరంగంగా బలపరిచి, ప్రచారం చేసిన అభ్యర్థి ఓడిపోయారు. అయినా శ్రీకాకుళం జిల్లాకు చెందిన మంత్రి, మాజీ టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు గెలిచినవారు కూడా తమ మద్దతుతోనే గెలిచారని ప్రచారం చేసుకుంటున్నారు. ఇది ఏ రకమైన సభ్యతో వారికే తెలియాలి. ఇంకా విచిత్రంగా పీడీఎఫ్ అభ్యర్థి వైకాపా మద్దతుతో పోటీ చేశారని అసత్యాలను, అవాస్తవాలను పేర్కొన్నారు. ఇది ఏ రకమైన సంస్కారమో వారికే తెలియాలి. అయితే ఇటువంటి సభ్యత, ఉన్నత సంస్కారం తెలుగుదేశం పార్టీ నాయకుల నుంచి, ముఖ్యంగా ఈ అవాస్తవాలు చెప్పిన ఆయన నుంచి ఆశించడం దురాశే అవుతుంది. నిజాయతీ గల ఒక సాధారణ పౌరుడుగా చూస్తే ఇటువంటి గెలుపు కూడా ఒక గెలుపేనా అనే సందేహం కలగక మానదు. దీనికంటే నిజాయితీగా పోరాడి, ఓడిపోయినవారే గొప్పవారు కదా అనేది కూడా అనిపించక మానదు.

అందుకే **ఈ ఎన్నికలలో 'గెలిచినవారు ఓడారు - ఓడినవారు గెలిచారు' అని చెప్పడం చాలా సముచితంగా ఉంటుంది. ఎందుకంటే ఎన్నికలలో ఓడిన పీడీఎఫ్ అభ్యర్థులు ముగ్గురూ ఒక్క దొంగ ఓటు వేయించలేదు. ఒక్క రూపాయి కూడా పంచలేదు. ఒక్క మందు చుక్క పోయించలేదు. ఒక్క బిర్యానీ పెట్టించలేదు. ఒక్కరినీ కూడా ప్రలోభ పెట్టలేదు. ఒక్క ఉత్తుత్తి హామీ కూడా ఇవ్వలేదు. ఇంకా విశేషమేమిటంటే వీరి ఎన్నికల ఖర్చే తక్కువ కాగా, ఆ ఖర్చును కూడా వీరి సంఘ సభ్యులే భరించడం. సొంత డబ్బులు ఖర్చు పెట్టుకుని ప్రచారంలో పాల్గొన్న కార్యకర్తలుండడం పీడీఎఫ్‌కు గర్వకారణం.**

ఎన్నికలలో పోటీ చేసినవారు గెలవడానికి అన్నిశక్తులు వడ్డడం సహజమే. అయితే అడ్డదారులు తొక్కి గెలవాలి అనుకోవడం మాత్రం రాజ్యాంగ విరుద్ధమే అవుతుంది. ప్రజాస్వామ్య స్ఫూర్తిగా విరుద్ధంగా తెలుగుదేశం కూటమి నాయకులు వ్యవహరించారు. దీనికి భిన్నంగా పీడీఎఫ్ అభ్యర్థులు ముగ్గురూ ఓడిన వెంటనే వారు ఇచ్చిన సందేశంలో పోరాటాల్లోనూ, సమస్యలు పరిష్కారాల్లోనూ మీతోనే ఉంటామని, మీ మధ్యనే ఉంటామని, పోరాటాల్లో ముందు వరసనే ఉంటామని ఓటర్లకు తెలియజేయడం వారి హుందాతనానికి నిదర్శనం. అటువంటి ఉన్నత విలువలను కలిగిన వారిని ఆదరించడం సమాజ ఉన్నతికి అత్యవసరం.

## భవన నిర్మాణ అనుమతులపై 'టౌన్ ప్లానింగ్'



**(సత్యంన్యూస్, శ్రీకాకుళం)**

నగర అభివృద్ధి కార్యాలయంలో నూతన భవన నిర్మాణ అనుమతుల విధానంపై బుధవారం సమీక్ష నిర్వహించారు. శ్రీకాకుళం అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ ఛైర్మన్ కొరికాన రవికుమార్ అధ్యక్షతన వైస్‌ఛైర్మన్, జాయింట్ కలెక్టర్ ఫర్మన్ అహ్మద్‌ఖాన్ సమక్షంలో సుడా పరిధిలోని లైసెన్స్‌డ్ టెక్నికల్ పర్సన్స్‌తో ఈ సమావేశం జరిగింది. సమావేశంలో టెక్నికల్ పర్సన్స్ నుంచి వచ్చిన సూచనలు, సలహాలను పరిగణనలోకి తీసుకుని, ప్రభుత్వానికి నివేదించనున్నట్లు సుడా ఛైర్మన్ తెలిపారు. భవిష్యత్తులో భవన నిర్మాణ అనుమతుల ప్రక్రియను మరింత సమర్థవంతంగా నిర్వహించి, అభివృద్ధిని వేగవంతం చేసేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. దరఖాస్తుదారులు భవన నిర్మాణ అనుమతులను సులభంగా పొందేందుకు అవసరమైన మార్పులను ప్రతిపాదిస్తామని తెలిపారు. నగర, జిల్లా స్థాయిలో సమన్వయంతో అభివృద్ధి పనులు జరగాలని ఆకాంక్షించిన ఛైర్మన్, నిర్మాణ అనుమతుల ప్రక్రియ పారదర్శకంగా, వేగంగా పూర్తి కావడమే లక్ష్యమని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో టౌన్ ప్లానింగ్ పీవో, ఏపీవో, జేపీవో, సుడా అధికారుల బృందం పాల్గొన్నారు.

# సగం రోడ్డేసి వదిలేసారు!

- **20 రోజులుగా రాకపోకలకు ఇబ్బందులు**
- **మున్సిపల్ అధికారులు ఓసారి లుక్కేయ్యండి**

**(సత్యంన్యూస్, శ్రీకాకుళం)**

నగర పాలక సంస్థ పరిధి గుజరాతిపేట నుంచి ఫాజుల్‌బాగ్‌పేట వరకు వెళ్లే మార్గంలో తోటవీధిలో మున్సిపల్ అధికారులు సగం రోడ్డేసి మధ్యలో వదిలేసారని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ కారణంగా ఈ ప్రాంతం గుండా పాఠశాలకు వెళ్తున్న విద్యార్థులు, స్కూల్ పిల్లలు పడిపోతున్నారని వారు ఆందోళన వ్యక్తం చేశారు. 20 రోజుల నుంచి ఈ రోడ్డు మార్గంలో ప్రయాణానికి నరకయాతన పడాల్సివస్తోందని, సచివాలయానికి వెళ్లి స్థానిక ఇబ్బందులు చెప్పినప్పటికీ వారెవ్వరూ పట్టించుకోవడంలేదని, తక్షణమే కమిషనర్‌తో పాటు సంబంధిత అధికార యంత్రాంగం స్పందించి ఈ సమస్యకు స్వస్తి పలకాలని, సగం వేసి వదిలేసిన రోడ్డును పూర్తిచేసి రాకపోకలకు రహదారి ఇబ్బందులు తొలగించాలని స్థానికులు కోరుతున్నారు



Printed by N.V.S. prasad, at Srikakulam and published by SATYAM PRINTERS, plot No. 8, Santamma colony, Srikakulam- 532001, Andhrapradesh on behalf of SANCHALANA SAYANKALA PATRIKA SATYAM, Srikakulam. Editor N.V.S. Prasad, Srikakulam, Andhra Pradesh. APTEL No. 2005/17967. Postal Reg. No. D/RNP/SKL-12/12-15.